క్లుప్తంగా

7న చలో విజయవాడ

మచిలీపట్నం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని అక్టోబరు 7న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక ఏపీటీఎఫ్ భవన్లో ఆదివారం ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులను సమీకరించాలని సభ్య సంఘాలను కోరారు. కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వి.సాంబశివరావు, శేషగిరి, ఇమ్మానుయేల్, సూరిబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే విడుదల చేయాలి

మచిలీపట్నం అర్బన్: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.ఎస్. దేవేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాలు బకాయిల్లో ఉండడంతో దసరా పండుగ సైతం వేదనగా మారిందన్నారు. కేంద్రం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ నిలిపివేయడంతో సమగ్ర శిక్షా ఉద్యోగులు జీతాలు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి కాంట్రాక్టు ఉద్యోగులకు ముందుగా వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను విడుదల చేయాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం డివిజన్ మెడికల్ ల్యాబొరేటరీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక సత్య కన్వెన్షన్ సెంటర్లో రాష్ట్ర కార్యదర్శి శర్మ పర్యవేక్షణలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా బొల్లా పాండు రంగారావు, కార్యదర్శిగా కొల్లూరి కృష్ణ, ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణ, కోశాధికారిగా ఎస్వీఎస్ రామలింగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా గడ్డిపాటి మంజూష, కిరణ్, ఈసీ సభ్యులు విజయబాబు, హరిబాబు, బాల సుబ్రహ్మణ్యం, కె.రవికుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దివ్యా ల్యాబ్ పి.రాంబాబు, ఎ.పవన్‌కుమార్, ఎంఎస్వీ రామారావు, ఎస్.అంకినీడు, పి.అశ్వినీకుమార్, రాష్ట్ర అసోసియేషన్ ముఖ్యులు పి.రామమోహనరావు, కె.శ్యామ్యూల్, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం




చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలు పంచాయతీ శివారు మేకావారిపాలెంలో జిల్లా పరిషత్ నిధులు రూ.8 లక్షలతో రెండు సీసీ రోడ్లకు ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి ప్రారంభోత్సవం చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సహకారంతో రోడ్లకు నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, పంచాయతీ పాలకవర్గ సభ్యురాలు రాజులపాటి రామలక్ష్మీ, అంకమ్మతల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు రాజులపాటి మురళీ, రాజులపాటి సురేష్, రాజులపాటి నాంచారయ్య, కాగిత జాలాచంద్రుడు, రాజులపాటి బిక్షం, ఈడే శ్రీనివాసరావు, రాజులపాటి బద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టెన్సిల్ ప్రింటింగ్‌పై అవగాహన

ఘంటసాల: ఘంటసాల మండలం ఘంటసాలపాలెం గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కమ్యూనిటీ సైన్స్ కళాశాల రావే విద్యార్థినీలు ముద్రణ పద్ధతులపై ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల స్టెన్సిల్ ప్రింటింగ్ విధానాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. స్టెన్సిల్ ప్రింటింగ్‌లో ఉపయోగించే పరికరాలైన స్పాంజ్, స్టెన్సిల్ బ్రష్, టూత్ బ్రష్ వంటివి ఎలా ఉపయోగించాలో విద్యార్థినీలు ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రింటింగ్ పద్ధతుల ద్వారా వస్త్రాలు, గృహోపకరణాలు అందంగా అలంకరించుకోవచ్చునని.. తక్కువ ఖర్చుతో సృజనాత్మకమైన పనులు చేయవచ్చునని రావే విద్యార్థినీలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



మహాచండీగా నాంచారమ్మ



మహాచండీగా పార్వతీదేవి



మహాచండీ అలంకరణలో అమ్మవారు



గణపేశ్వరంలో లలితా త్రిపుర సుందరి



కె.కొత్తపాలెంలో భ్రమరాంబ అమ్మవారు

శక్తి స్వరూపిణీ.. మహాచండీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. లోకనాయకిని ఆదివారం బంగారు ఆభరణాలు, పరిమళ పుష్పాలతో మహాచండీ దేవిగా అలంకరించారు. దేదీప్యమానంగా వెలుగొందుతున్న అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు అభయమివ్వాలని ప్రణమిల్లారు. ఈ సందర్భంగా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక కుంకుమార్చనలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమివ్వనున్నారు.

- మహాచండీ దేవిగా అమ్మవారి దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నేడు సరస్వతీ దేవిగా జగన్మాత



కళశాలతో ఊరేగింపుగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కోడూరు: కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ అమ్మవార్లు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి.

మచిలీపట్నం టౌన్: ఆజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి శ్రీ సంతోషిమాత దేవిగా, శ్రీ పార్వతీదేవి శ్రీ మహాచండీగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీ సిద్ధేంద్ర నర్తన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు దాసరి ద్రాక్షాయని పర్యవేక్షణలో నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆహుతులను అమితంగా ఆకట్టుకుంది. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు శ్రీ లలితాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు.

పెడన: పట్టణంలో కొలువైన శ్రీపైడమ్మ అమ్మవారు శ్రీ పరాశక్తి దేవిగా దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉరివి గ్రామంలోని శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వర ఆలయంలో అమ్మవారు శ్రీ కాత్యాయని దేవి దర్శనం ఇచ్చారు.

కృత్తివెన్ను: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కృత్తివెన్ను శివాలయంలో అమ్మవారిని ఆదివారం గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

గూడూరు: మండల కేంద్రమైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. తరకటూరు శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. రామన్నపేట శివాలయం, ఐదుగుళ్లపల్లి శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయాలలో శ్రీ మహాచండీ దేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.

బంటుమిల్లిలో ప్రత్యేక పూజలు..

బంటుమిల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. స్థానిక కనకదుర్గా ఆలయం, పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీగజలక్ష్మి దేవిగా, శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీగజలక్ష్మి దేవిగా, పెదతుమ్మిడి శివాలయంలో శ్రీమహాలక్ష్మి దేవిగా అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని లలితా, విష్ణు సహస్రనామ పారాయణం పాటించారు.

గణపేశ్వరంలో లలితా దేవిగా దుర్గమ్మ..

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని గణపేశ్వరంలో శ్రీదుర్గా–గణపేశ్వర స్వామి ఆలయాల్లో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఆదివారం శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో సీహెచ్ సుధాకరరావు పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్త మండల రాంబాబు–అరుణ దంపతులు అర్చకుడు పోతుకూచి సత్య నారాయణ నేతృత్వంలో ఉత్సవ పూజ జరిపారు. నాగాయలంకలోని శ్రీపార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవార్లు శ్రీవనదుర్గాదేవి, శ్రీమహాచండీ దేవి అలంకారంలో కొలువుతీరారు.

చల్లపల్లిలో 108 కళశాలతో ఊరేగింపు..

చల్లపల్లి: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనం నుంచి పెదకళ్లేపల్లి రోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వరకూ 108 కళశాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలో దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఏడో రోజు అమ్మవారిని శ్రీ మహాచండీ దేవిగా అలంకరించారు. కె.కొత్తపాలెంలో దుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో దుర్గామాత మహాచండీగా భక్తులకు దర్శినమిచ్చారు.



పెడనలో సామూహిక కుంకుమార్చన



శ్రీ మంగళగౌరీ దేవిగా బాలపార్వతీ

శ్రీ జలధీశ్వర స్వామి ఆలయంలో..

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో కొలువైన శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ బాలపార్వతీ అమ్మవారు ఆదివారం శ్రీ మంగళగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అవనిగడ్డ: అవనిగడ్డ రాజశేఖర స్వామి ఆలయంలో రాజేశ్వరీ అమ్మవారు, అవనిగడ్డ లంకమ్మ అమ్మవారి ఆలయంలో లంకమ్మ అమ్మవారు గంగాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అవనిగడ్డ గీతా మందిరంలో రాజేశ్వరీ దేవి వన దేవతగా దర్శనమిచ్చారు.

నిండుకుండలా కృష్ణమ్మ

- పులిగడ్డ ఆక్విడెక్టును తాకిన వరద
- ఆందోళనలో రైతన్నలు

నాగాయలంక: ప్రకాశం బ్యారేజీ నుంచి 6 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో నాగాయలంకకు వరద తాకిడి ఎక్కువైంది. ఆరో వార్డు చిన కరకట్ట కింద కృష్ణానది ఒడ్డున నివాసితుల గృహాలు, ఆక్వా కంపెనీలలో వరద నీరు ఆదివారం చేరింది. రాత్రికి ఆ సంఖ్య 7 లక్షల క్యూసెక్కులకు చేరనుందని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. నదీ పరీవాహక లంక ప్రాంతాల్లో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కోడూరు: ఉల్లిపాలెం వద్ద కృష్ణమ్మ నిండుకుండలా మారింది. వరద ఎక్కువగా ఉండడంతో నదిలో వేటను నిలిపివేశారు.

చల్లపల్లి: మండల పరిధిలో దిగువన్న నిమ్మగడ్డ, రాముడుపాలెం, నడకుదురు, నాదెళ్లవారిపాలెం ప్రాంతాల మెట్ట పొలాలలు ఇప్పటికే 30 ఎకరాల వరకూ ముంపునకు గురయ్యాయని రైతులు తెలిపారు. వరద పెరుగుతుండడంతో కట్ట దిగువన ఉన్న పంట పొలాల్లోని మోటార్లను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

బొబ్బర్లంక(మోపిదేవి): రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖ అధికారులతో స్థానిక తాహసీల్దార్ ఆదివారం మండలంలో వరద ప్రభావిత గ్రామాలైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, మోపిదేవివార్పు పర్యటించారు. అనంతరం మోపిదేవివార్పు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

చల్లపల్లి: వరద ఉధృతి సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం స్థానికులను హెచ్చరించారు. ఆముదార్లంకలో ఆదివారం ఆయన తన సిబ్బందితో పర్యటించారు. గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.

శ్రీకాకుళం(ఘంటసాల): నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల వద్ద వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. వరద ప్రాంతాల వైపు ప్రజలు, రైతులు, పశువుల కాపరులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వీఆర్వోలను, రెవెన్యూ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

అవనిగడ్డ: ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేసిన వరద పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తుంది. మరో అడుగు వరద పెరిగితే ఆక్విడెక్టు పంటకాలువలోకి వరద నీరు వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. వరద ఉధృతి పెరగటంతో పాట ఎడ్లంక గ్రామస్తులను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ప్రవాహానికి నదీ పరివాహక ప్రాంతంలోని నేల చాలా వరకూ కోతకు గురైంది.



పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద వరద



వరద కారణంగా కోతకు గురైన నేల



ఆముదార్లంక వద్ద గస్తీ ఏర్పాటు చేసిన పోలీసులు



నాగాయలంక చిన కరకట్ట వద్ద పరిస్థితి



మోటార్లను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రైతులు

కవి కోకిల.. గుర్రం జాషువా



జిల్లా గ్రంథాలయ సంస్థలో జాషువా చిత్రపటం వద్ద నివాళులు

మచిలీపట్నం టౌన్: నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మ విభూషణ్ గుర్రం జాషువా జయంతిని నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని బుట్టాయిపేట జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జాషువా జయంతిని నిర్వహించారు. సాహితీ స్రవంతి మచిలీపట్నం కన్వీనర్ పైడిపాటి రాందేవ్ జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, నాయకులు సీహెచ్ రాజేష్, కొడాలి శర్మ, బి.సుబ్రహ్మణ్యం, రాజు, ఎస్ఎస్ నారాయణ, కె.వసంతరావు, పి.ధనశ్రీ, భవాని తదితరులు పాల్గొని నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ టీచర్ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. జాతి, కుల, మతాలకు అతీతంగా తెలుగు పద్య శిల్పాన్ని మలచిన కవి శిఖామణులలో జాషువా అగ్రగామిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సాహితీ పరిషత్ అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఉప గ్రంథాలయాధికారి బి.వెంకటరమణ, పరిషత్ కార్యదర్శి ఎం.శాస్త్రి, పాఠకులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుల ఫీజు పెంచే యోచన

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశంలో చర్చ!

పెడన: పట్టణంలో వ్యాపారం చేసుకునే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు పొందాల్సి ఉంటుంది. అటువంటి ట్రేడ్ లైసెన్సులో 2019–20 ఏడాదిలో సవరించిన దాని ప్రకారం వసూళ్లు చేస్తున్నారు. 2026–27 ఏడాది నుంచి డీ అండ్ వో ట్రేడ్ లైసెన్సు ఫీజును పెంచుదామని.. అందుకు కౌన్సిల్ తీర్మాణం చేసేలా అజెండాలో అంశాన్ని పొందుపరిచారు. సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అంజెడాలో పొందుపరిచిన 29 అంశాలపై చర్చించి ఆమోదించనున్నారు. కౌన్సిల్ ఆమోదంతో పనులను అప్పగించనున్నారు. నవంబరు నెలాఖరు, డిసెంబరు మొదటి వారంలో జరగనున్న పైడమ్మ జాతర మహోత్సవాలలో పురపాల సంఘానికి సంబంధించి వేలం పాటల విషయంలో రేట్లను పెంచుతూ పాట పాడుకునే వారి విషయంలో కొన్ని కీలక మార్పులు చేశారు. పాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్, రెండు పోస్టెడెట్ చెక్కులు ఇచ్చేలా అంశాన్ని అజెండాలో చేర్చారు. అజెండాలో అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం పొందేలా వైఎస్సార్ సీపీ పాలకులు చర్యలు చేపట్టారు.

ఏపీ వీఆర్వోల అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కర్రా నాగరాజు



చిలకలపూడి(ఘంటసాల): ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ ఆఫీసర్స్(వీఆర్వోల) అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఘంటసాల మండలం చిలకలపూడి గ్రామానికి చెందిన కర్రా నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవనంలో ఏపీ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షత ఏపీ వీఆర్వోల అసోసియేషన్ నూనత కార్యవర్గం ఆదివారం ఎన్నుకోగా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏపీ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోన ఆంజనేయ కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.అనుపమలు ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. అనంతరం నూతన జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన నాగరాజును ఘంటసాల, బాపులపాడు, తదితర గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏపీ గ్రామ రెవెన్యూ ఆఫీసర్స్ కార్యవర్గ సభ్యులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ విధి నిర్వహణలో పాల్గొంటాం

టి.కొత్తపాలెం(నాగాయలంక): అక్టోబర్ 1వ తేదీన పింఛన్ల పంపిణీ విధినిర్వహణకు హాజరవుతామని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టి.కొత్తపాలెం కార్యదర్శి ఆది అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస అవసరాలు తీర్చుకునే క్రమంలో ఎదురు చూసే సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు ఇబ్బందులు కలుగనీయమని ఆయన పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ పూర్తయ్యాక సచివాలయ ఉద్యోగుల ఉద్యమానికి అంశాల వారీగా మద్దతు ప్రకటిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణం చర్చలు జరపాలని అశోక్ డిమాండ్ చేశారు.

ప్రారంభమైన మురళీ కోలాటం పోటీలు



చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న జిల్లాల స్థాయి మురళీ కోలాటం పోటీలను ఆదివారం ప్రారంభించారు. కాగా తాళం భజన పోటీలు సైతం ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా తోట్లవల్లూరు మండలం కనిగిరిలంక గ్రామానికి చెందిన పోతురాజు మురళీ కోలాట సమాజం ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. చినకళ్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ గణపతి భజన సమాజం వారు నిర్వహిస్తున్న తాళం భజన కార్యక్రమం సైతం కనుల పండువగా జరిగింది. కొడాలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత పరుచూరి కృష్ణ, దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వరరావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కంకటావలో శక్తి పటాల ఊరేగింపు



గూడూరు: దసరాను పురస్కరించుకుని మండల పరిధిలోని కంకటావ గ్రామంలో నిర్వహించిన శక్తి పటాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కంచర్లపల్లి మాధవి నాగేంద్రరావుల అధ్వర్యంలో మచిలీపట్నం నుంచి శక్తి పటాలు గ్రామానికి రప్పించారు. ఇప్పటి వరకూ గూడూరు మండలంలో శక్తి పటాల ఊరేగింపు నిర్వహించిన దాఖలాలు లేవు. కాగా మండలంలో మొట్టమొదటి సారిగా కంకటావలో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించిన శక్తి పటాలకు పసుపు ఆటతో యువకులు సందడి చేశారు.